# కరీంనగర్ గడ్డకు నేడు గులాబీబాస్

- స్వరాష్ట్రంలో ప్రగతి వైపు పరుగు
- ముఖ్యమంత్రి సహకారం.. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కృషి
- ₹1,800 కోట్లతో అభివృద్ధి
- నారాయణపూర్‌తో సస్యశ్యామలం
- గోదావరి జలాలతో పరుచుకున్న పచ్చదనం
- భవ్యక్షేత్రంగా కొండగట్టు అంజన్న ఆలయం
- ₹100 కోట్లు ఇచ్చిన సీఎం కేసీఆర్
- విద్య, వైద్యం బలోపేతం



గంగాధర మండలం మధురానగర్‌లో సభ స్థలం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కరీంనగర్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. అన్ని పార్టీల కంటే ముందే బీఆర్ఎస్ తన అభ్యర్థులను ప్రకటించడంతోపాటు మూడు చోట్ల సిట్టింగ్‌లకే మరోసారి అవకాశం కల్పించారు. హుజూరాబాద్‌లో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డిని పోటీలో నిలిపారు. దీంతో అన్ని పార్టీల అభ్యర్థులకంటే ముందుగానే బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించి నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి గంగుల కమలాకర్ తనదైన శైలిలో ప్రత్యర్థి పార్టీలకు అందనంత దూరంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇటు చొప్పదండిలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కూడా గ్రామల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుండటంతో రెట్టించిన ఉత్సాహంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక హుజూరాబాద్‌లో అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి కూడా ప్రచా రంలో దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఈ మూడు చోట్ల ఒకే రోజు ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించనున్నారు.

### ఒకే రోజు మూడు చోట్ల సభలు

ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు చోట్ల ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. గత నెల 15న హుస్నాబాద్ వేదికగా సభలకు శ్రీకారం చుట్టిన ఆయన, ఆ తర్వాత 17న సిరిసిల్ల, ఈ నెల 2న ధర్మపురి, 3న కోరుట్ల, 7న మంథని, పెద్దపల్లిలో సభల్లో పాల్గొన్నారు. ఈ నెల 26 వరకు ఉమ్మడి జిల్లాలోని మరో ఏడు సభలకు హాజరవుతారు. అయితే ఇప్పటి వరకు ఏ రోజు ఉమ్మడి జిల్లాలో ఒకే రోజు సభల్లో పాల్గొనలేదు. కానీ, నేడు ఒకే రోజు మూడు నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననుండగా, ఆయాచోట్ల ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. సభా వేదికలను సిద్ధం చేయడంతోపాటు విజయవంతం చేయడం కోసం భారీగా జన సమీకరణ చేస్తున్నారు.

### ఏర్పాట్లను పరిశీలించిన అభ్యర్థులు

కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో నేటి ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తన నామినేషన్ దాఖలు చేసిన రోజునే మంత్రి భారీ జన సమీకరణ చేశారు. నగరంలోని అన్ని డివిజన్లు, రెండు మండలాల నుంచి లక్షకుపైగా జనాన్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కరీంనగర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు సభ జరగనుంది. ఆ తర్వాత చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని గంగాధర మండలం మధురానగర్ శివారులోని పత్తికుంటపల్లి కాలనీలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నారు. దీనికోసం స్థానిక అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్ని ఏర్పాట్లూ చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీగా జనాన్ని సమీకరిస్తున్నారు. ఇక్కడి సభలో మధ్యాహ్నం 2.35 గంటలకు సీఎం కేసీఆర్ పాల్గొంటున్నారు. అనంతరం 3.45 గంటలకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట డిగ్రీ కళాశాలలో నిర్వహించే సభలో సీఎం పాల్గొంటున్నారు. ఇక్కడి అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### కార్యకర్తల్లో నూతనోత్తేజం

ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తుండగా, బీఆర్ఎస్ కార్యకర్తల్లో నూతనోత్తేజం కనిపిస్తున్నది. కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో భారీగా జన సమీకరణకు ప్రతి కార్యకర్తా తనవంతు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గెలుపు బాటలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థులకు పార్టీ అధినేత సభలు మరింత బలాన్ని చేకూర్చుతాయని భావిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లి జనాన్ని సమీకరించే పనిలో తలమునకలయ్యారు.



జమ్మికుంటలో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నియోజక వర్గ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## శ్రీధర్‌బాబు ఫొటోలతో గోడగడియారాలు




మంథనిలో ఎఫ్ఎస్టీ బృందం పట్టుకున్న శ్రీధర్‌బాబు ఫొటోతో ఉన్న గోడ గడియారాల వ్యాను

- హైదరాబాద్ నుంచి కాటారంకు డీసీఎం వ్యాన్‌లో తరలింపు
- మంథనిలో పట్టుకున్న ఎఫ్ఎస్టీ టీం
- ₹లక్షా 96వేల విలువైన 5,368 గోడ గడియారాలు ఉన్నట్లు గుర్తింపు
- కేసు నమోదు

పెద్దపల్లి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): మంథని కాంగ్రెస్ అభ్యర్థి, ఆ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫొటోలతో ఉన్న గోడగడియారాలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్టీ) పట్టుకున్నది. హైదరాబాద్ నుంచి కాటారంకు తరలిస్తుండగా, మంథనిలో స్వాధీనం చేసుకున్నది. ఈ విషయాన్ని మంథని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీ హనుమనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. ఎప్పటిలాగే బుధవారం అర్ధరాత్రి తర్వాత మంథని తెలంగాణ తల్లి చౌరస్తాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలు చేస్తున్నది. ఆ సమయంలో కాటారం వెళ్తున్న ఓ డీసీఎం వ్యాన్ (ఏపీ 01వై 2700)ను ఆపి తనిఖీ చేయగా, అందులో కాంగెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు ఫొటోలతో ముద్రించి ఉన్న గోడ గడియారాలను గుర్తించింది. దాంతో వ్యానును తమ ఆధీనంలోకి తీసుకొని, గోడ గడియారాలను, వ్యానును సీజ్ చేసి మంథని పోలీసు స్టేషన్‌కు తరలించింది. అంతులో మొత్తం ₹లక్షా 96వేల విలువైన 5,368 గోడ గడియారాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ గోడ గడియారాలను హైదరాబాద్ మలక్‌పేటలోని శ్రీ కృప మార్కెట్‌లో కొనుగోలు చేసి, మంథని నియోజకవర్గం కాటారం రెవెన్యూ డివిజన్‌లోని చింతకాని ఎక్స్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీ ఏజెన్సీస్‌కు శ్రీరామ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా తరలిస్తున్నట్లుగా గుర్తించి వీడియో, ఫొటో చిత్రీకరణ చేశారు. ఎఫ్ఎస్టీ బృందం ఇన్‌చార్జి ఫిర్యాదు మేరకు మంథని పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ 272ద్వారా కేసు నమోదు చేశారు.

## రామన్న రుణం తీర్చుకుందాం

- భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- సిరిసిల్ల ప్రజల గౌరవాన్ని పెంచిన మంత్రి కేటీఆర్
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు
- కేటీఆర్‌కు మద్దతుగా సిరిసిల్ల బీసీ సంక్షేమ సంఘం ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

సిరిసిల్ల, నవంబర్ 16 : సిరిసిల్ల అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించి రుణం తీర్చుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్లలోని బీసీ భవన్‌లో జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు తడక కమలాకర్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. దీనికి పర్శ హన్మాండ్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చించిన అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్‌కు పూర్తి స్థాయి మద్దతునివ్వాలని ముక్తకంఠంతో నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు మంత్రి కేటీఆర్‌కు మద్దతునివ్వాలని కోరగా, వారి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని కేటీఆర్‌కు మద్దతునిస్తున్నట్లు ప్రకటించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 80 శాతం కౌన్సిలర్ సీట్లు కేటాయించారని, నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీపీల్లో రెండు ఎంపీపీ స్థానాలను బీసీలకు కేటాయించారని తెలిపారు. సెస్ ఎన్నికల్లో ఏడు సెస్ డైరెక్టర్ స్థానాలకు నాలుగు డైరెక్టర్ స్థానాలను బీసీలకు కేటాయించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికి చెందిన తోట ఆగయ్యకు ఇచ్చారని, బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారని తెలిపారు. బీసీ రెసిడెన్సియల్ పాఠశాలలు, కళాశాలలు, బీసీలకు ఆత్మగౌరవ భవనాలు మంజూరు చేశారని, బీసీలకు వెన్నంటి ఉంటున్న మంత్రి కేటీఆర్‌కు పూర్తి స్థాయి మద్దతు ఇస్తున్నామన్నారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికి ఎమ్మెల్యే కాకపోతే ఇంత అభివృద్ధి జరుగుతుండేనా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల చుట్టూ 24 గంటలు మానేరు వాగు పారుతుందని తెలిపారు. మండుటెండలో సైతం మానేరు వాగు మత్తడులు దూకించిన ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఉమ్మడి పాలనలో సిరిసిల్లలో ప్రతి రోజూ నేతన్న ఆత్మహత్యలు చేసుకునేవారని, స్వరాష్ట్రంలో మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపి నేతన్నలకు పలు పథకాలను అందించి ఆత్మహత్యలు లేకుండా చేశారని తెలిపారు. సిరిసిల్ల ప్రజల గౌరవాన్ని మంత్రి కేటీఆర్ పెంచారని, ఆయన ప్రాతినిధ్యం వహించడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. సిరిసిల్లను అభివృద్ధి చేసిన మంత్రి కేటీఆర్ రుణం తీర్చుకోవడానికి సమయం ఆసన్నమైందన్నారు. ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గణేశ్, కమలాకర్, రామాగౌడ్, తిరుపతి , కైలాస్, రవిగౌడ్, రాజు, రవీందర్, రాజుగౌడ్, శ్రీనివాస్, సురేశ్, మహేశ్, ఆంజనేయులు, సత్తయ్య, నరేశ్ పాల్గొన్నారు.